

పకడ్బందీగా నిర్వహించాలి

నవోదయ విద్యాలయంలో ఖాళీ సీట్ల భర్తీ కోసం నిర్వహించే ఎంట్రెన్స్‌కు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

- 8లో ▸



ఆత్మవిశ్వాసంతో సాగాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం ఉప్పల్‌వాయిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.2 / 16.3

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి చలి తీవ్రత తగ్గే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'చట్టాలపై అవగాహన పెంచుకోవాలి'



కామారెడ్డి టౌన్: హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి నాగరాణి పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని సబ్ జైల్‌ను సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ఖైదీల హక్కులు, చట్టాల గురించి వివరించారు. ఫిర్యాదుల బాక్స్, వంట గదులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాది మోహన్‌రావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీనివాస్ రావు, సబ్ జైలు సూపరింటెండెంట్ సంజీవ రెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది శ్రావణ్, సాయిప్రణీత్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఎరువుల కొరత లేదు'



భిక్కనూరు: జిల్లాలో ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన అంతంపల్లి, పెద్ద మల్లారెడ్డి, జంగంపల్లి గ్రామాల్లోని సింగిల్ విండోలను సందర్శించి, ఎరువుల నిల్వల తెలుసుకున్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని సొసైటీల సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏడీఏ అపర్ణ, సింగిల్ విండోల సీఈవోలు శ్రీనివాస్, మోహన్‌గౌడ్ తదితరులున్నారు.

'రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు'



భిక్కనూరు: జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కామారెడ్డి ఏఎస్పీ చైతన్యరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె భిక్కనూరు మండలంలోని జాతీయ రహదారిపై గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదాలు జరగడానికి కారణాలు తెలుసుకుని, తిరిగి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన ప్రాంతంలో ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. ఆమె వెంట సీఐ సంపత్‌కుమార్, ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

దేవునిపల్లి పీఎస్ పరిధిలో..

కామారెడ్డి క్రైం: దేవునిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగాపూర్, చిన్నమల్లారెడ్డి, పొందుర్తి, క్యాసంపల్లి ప్రాంతాల్లోని హాట్‌స్పాట్‌లను ఏఎస్పీ చైతన్యరెడ్డి పరిశీలించారు. ఆమె వెంట కామారెడ్డి రూరల్ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది ఉన్నారు.

బస్టాండ్ పరిశీలన



లింగంపేట: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను శుక్రవారం ఆర్ఎం జ్యోత్స్న సందర్శించారు. బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిరతో మాట్లాడి బంక్ మూసి ఉండడానికి గల కారణాలను తెలుసుకున్నారు. బస్టాండ్‌కు ఇరువైపులా ఉన్న ప్రవేశ ద్వారాల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట డిప్యూటీ ఆర్ఎం సరస్వతి, బస్టాండ్ కంట్రోలర్ రఫీక్ తదితరులున్నారు.

రేషన్ కార్డుల దరఖాస్తులకు వెబ్‌సైట్ పునరుద్ధరణ

కామారెడ్డి క్రైం: రేషన్ కార్డులకోసం దరఖాస్తు చేసుకోవడానికి వెబ్‌సైట్ సేవలను పునరుద్ధరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ప్రజాపాలన కేంద్రాలలో దరఖాస్తు చేసుకోని వారు మీసేవ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

కడుపులోనే కత్తెర!



- సృష్టికి విరుద్ధంగా అడుగులు
- జిల్లాలో యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు..
- ఆపై ఎడాపెడా అబార్షన్లు
- ఏటా తగ్గుతున్న ఆడపిల్లల సంఖ్య

జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలకు అడ్డుకట్ట పడడం లేదు. పుట్టేది ఆడపిల్లని తెలియగానే కడుపులోనే ఊపిరి తీసేస్తున్నారు. దీంతో జిల్లాలో ఏటా ఆడపిల్లల జననాల సంఖ్య తక్కువగానే ఉంటోంది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

ఆడ పిల్లలంటే ఇంటికి వెలుగు దివ్వెలు. వారుండే ఇల్లు నందనవనం. ఆధునిక కాలంలో ఆడపిల్లలు అన్నింటా రాణిస్తున్నారు. వారు సత్తా చాటని రంగం ఏదీ లేదు. అలాంటిది కొందరు మగబిడ్డే వారసుడని భ్రమపడుతూ పురిటిలోనే ఆడ శిశువులను చంపేస్తున్నారు. లింగనిర్ధారణ పరీక్షలు చేసి భ్రూణ హత్యలకు పాల్పడుతున్నారు. దీంతో జిల్లాలో ఆడ, మగ నిష్పత్తి దెబ్బతింటోంది. కామారెడ్డి జిల్లాలో 2023 సంవత్సరంలో 11,302 మంది పిల్లలు పుడితే అందులో 6,001 మంది మగ పిల్లలు, 5,301 మంది ఆడ పిల్లలు ఉన్నారు. అంటే ఆడపిల్లల సంఖ్య 700 తక్కువగా ఉంది. 2024 లో 10,474 మంది పిల్లలు పుడితే ఇందులో 5,447 మంది మగ పిల్లలు, 5,027 మంది ఆడపిల్లలు ఉన్నారు. ఈసారి కూడా మగపిల్లల కన్నా 420 మంది ఆడపిల్లలు తక్కువగా జన్మించారు.

అన్నింటా రాణిస్తున్నా..

ఆడపిల్లలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మన జిల్లాలోనే ఎంతో మంది అమ్మాయిలు ఉన్నత స్థితికి ఎదిగారు. చదువుల్లో అగ్రభాగాన నిలుస్తున్నారు. వైద్య రంగంలో, సాఫ్ట్‌వేర్ రంగంలో, క్రీడల్లో, శాస్త్ర సాంకేతిక పరిశోధనల్లోనూ ముందువరుసలో నిలుస్తున్నారు. తాడ్వాయి గురుకులంలో చదివిన మలావత్ పూర్ణ ఎవరెస్టు ఎక్కింది. పిట్లంకు చెందిన తక్కడ్‌పల్లి ప్రతిభ యుద్ధక్రీడల్లో అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది. రాష్ట్ర స్థాయితో పాటు జాతీయ స్థాయిలోనూ వివిధ క్రీడల్లో మన జిల్లాకు చెందిన విద్యార్థినులు రాణిస్తున్నారు. మౌనిక అనే విద్యార్థి యూత్ పార్లమెంట్ సమావేశంలో మాట్లాడి అబ్బురపరిచింది. ఇలా అన్నింటా అమ్మాయిలు రాణిస్తున్నారు. ఉద్యోగాల్లో సగానికిపైగా వాళ్లే ఆక్రమిం చేస్తున్నారు. అయినా తల్లిదండ్రుల ధోరణిలో మార్పు రావడం లేదు. ఆడపిల్లల ఉన్నతి కోసం ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నా, ఆఖరుకు ఆడపిల్ల పెళ్లికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లాంటి పథకాలు తీసుకువచ్చి ఆసరా అవుతున్నా కూడా ఆడపిల్లను భారంగానే చూస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

దర్జాగా దందా..

చాలా కుటుంబాల్లో మగబిడ్డే వారసుడనే భావన ఉంది. అలాగే ఆడపిల్లలు అంటే వివక్ష కూడా ఉంది. చదివించి, కట్న కానుకలు ఇచ్చి పెళ్లి చేసి అత్తారింటికి పంపడం భారంగా భావించే వారు ఎందరో ఉన్నారు. వెరసి ఆడపిల్లలు వద్దనుకుంటూ కడుపులోనే తుంచేసే దుర్మార్గానికి తెగబడుతున్నారు. లింగ నిర్ధారణ పరీక్షల్లో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే ఘనతకెక్కింది. ప్రజల మానసిక స్థితిని వ్యాపారంగా మలచుకున్న కొందరు నిబంధనలకు విరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ కడుపులో పెరిగేది ఆడబిడ్డో, మగ బిడ్డో చెప్పేస్తున్నారు. ఆడబిడ్డ అని తెలియగానే కొందరు అబార్షన్ చేయించుకుంటున్నారు. కామారెడ్డిలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ అడ్డంగా దొరికినా, రికార్డుల్లో లేని స్కానింగ్ మిషన్లు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడినా అధికారులు నామమాత్రపు చర్యలతో చేతులు దులిపేసుకున్నారు. డబ్బులు వెదజల్లితే ఎవరూ అడ్డుకోరనే ధీమాతో నిర్వాహకులు దర్జాగా దందా నడుపుతూనే ఉన్నారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకుని అధికారులనే బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని తెలుస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం స్కానింగ్ మాఫియాకు కలిసొస్తోంది. జిల్లాలో పడిపోతున్న లింగ నిష్పత్తిని చూసైనా అధికారుల్లో మార్పు రావలసిన అవసరం ఉంది.

నిష్పత్తిలో వ్యత్యాసం..

జనాభా లెక్కలు చూసినా, ఓటర్ల లెక్కలు చూసినా మహిళలే ఎక్కువ ఉంటున్నారు. కానీ పిల్లల వద్దకు వచ్చేసరికి ఏడాదికేడాది ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతోంది. ఆడ అయితే అబార్షన్ చేయించుకుంటున్న పరిస్థితుల్లో ఆడపిల్లల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. జిల్లాలో పదిహేనేళ్లుగా ఆడ, మగ నిష్పత్తిలో వ్యత్యాసం పెరుగుతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో మరింత దయనీయ పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయి. ఇప్పటికే కొన్ని కులాల్లో ఆడపిల్లల సంఖ్య భారీగా తగ్గిపోయింది. అమ్మాయిల సంఖ్య తక్కువగా ఉండడంతో చాలామందికి పెళ్లి కావడం లేదు.

గతేడాది ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా జననాల వివరాలు..

ప్రాజెక్టు	మొత్తం	మగ	ఆడ	వ్యత్యాసం
బాన్సువాడ	1,987	992	995	+3
దోమకొండ	2,021	1,064	957	-107
కామారెడ్డి	2,429	1,270	1,159	-111
మద్నూర్	1,794	920	874	-46
ఎల్లారెడ్డి	2,243	1,201	1,042	-159
మొత్తం	10,474	5,447	5,027	-420

ఎమ్మెల్సీ స్థానాలకు భారీగా నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి



నామినేషన్ వేస్తున్న బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, పక్కన కామారెడ్డి ఎమ్మెల్యే కేవీఆర్



నామినేషన్ వేస్తున్న మదనం గంగాధర్

- పట్టభద్రుల స్థానానికి 28, ఉపాధ్యాయ స్థానానికి 2 దాఖలు
- ర్యాలీగా వెళ్లి నామినేషన్లు వేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్–మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు నామినేషన్లు పోటెత్తాయి. శుక్రవారం మంచిరోజు కావడంతో ఆశావహులు అనుచర గణంతో ర్యాలీలతో వచ్చి నామినేషన్లు వేశారు. శుక్రవారం ఒక్కరోజే గ్రాడ్యుయేట్స్ స్థానానికి 28 మంది నామినేషన్లు వేయగా, టీచర్స్ స్థానానికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఈనెల 3న నామినేషన్ల పర్వం మొదలైనప్పటికీ.. శుక్రవారం అత్యధికంగా నామినేషన్లు దాఖలు కావడం గమనార్హం. ఉదయం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి నామినేషన్ వేశారు. బీజేపీ నుంచి బరిలో ఉన్న అంజిరెడ్డి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి వెంట రాగా.. నామినేషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ టికెట్టు ఆశించి భంగపడ్డ మాజీ మేయర్ రవీందర్ సింగ్, ప్రసన్న హరికృష్ణలు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. వీరిలో రవీందర్ సింగ్ సన్నిహితులతో రాగా, హరికృష్ణ అనుచరులు, కళాకారులతో భారీ ర్యాలీగా వచ్చారు. వీరితోపాటు సామాజిక ఉద్యమకారులు బక్క జడ్సన్, సిలివేరు శ్రీకాంత్, మాజీ డీఎస్పీ మదనం గంగాధర్, లక్ష్య స్కూల్స్ అధినేత ముస్తాక్ అలీ కూడా నామినేషన్ పత్రాలను కలెక్టర్ పమేలాకు అందజేశారు.

నేడు, రేపు సెలవు..!

నేడు రెండో శనివారం, రేపు ఆదివారం కావడం వల్ల రెండు రోజులు నామినేషన్ల ప్రక్రియకు సెలవు వచ్చినట్లయింది. ఇక మిగిలింది 10వ తేదీ మాత్రమే. చివరి రోజు కూడా భారీగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలున్నాయి.

సుభాష్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు!

- 'స్థానిక' పోరు ముందు కాంగ్రెస్‌లో కీలక పరిణామం
- చర్చనీయాంశంగా మారిన పార్టీ నిర్ణయం



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నేత వడ్డేపల్లి సుభాష్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ పీసీసీ క్రమశిక్షణ సంఘం చైర్మన్ జి.చిన్నారెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న విషయంలో షోకాజ్ నోటీసుకు ఇచ్చిన వివరణపై సంతృప్తి చెందలేదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడినందునే సస్పెన్షన్ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా కొనసాగిన వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి గత అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్టు కోసం తీవ్రంగా శ్రమించారు. అయితే మదన్‌మోహన్‌రావుకు టికెట్టు దక్కడంతో సుభాష్‌రెడ్డి పార్టీకి రిజైన్ చేసి బీజేపీలో చేరారు. బీజేపీ టికెట్టుపై పోటీ చేసి ఓడిపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో సుభాష్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్ గూటికి చేరారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో తనకంటూ వర్గాన్ని ఏర్పాటు చేసుకుని పార్టీ కార్యకలాపాలు నిర్వహిస్తూ వస్తున్నారు. అయితే ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు, సుభాష్‌రెడ్డి వర్గాల మధ్య పొసగడం లేదు. ఇరు వర్గాల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుభాష్‌రెడ్డి వ్యవహారంపై ఎమ్మెల్యే, ఆయన అనుచరులు పార్టీ నాయకత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో పీసీసీ క్రమశిక్షణ సంఘం సుభాష్‌రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చింది. సుభాష్‌రెడ్డి ఇచ్చిన సమాధానంతో సంతృప్తి చెందని క్రమశిక్షణ సంఘం.. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో సస్పెన్షన్ వేటు వేయడం పార్టీలో చర్చనీయాంశమైంది.

వచ్చేనెలలో 'యూఎస్‌ఏ'లో ప్రవేశానికి ఎంపిక పోటీలు

కామారెడ్డి అర్బన్: కేరళ రాష్ట్రం కోజికోడ్ జిల్లాలోని కినలూర్‌లో గల ఉష స్కూల్ ఆఫ్ అథ్లెటిక్స్ (యూఎస్‌ఏ)లో ప్రవేశం కోసం బాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఆసక్తిగలవారు వచ్చే నెల 1వ తేదీన ఉదయం 8 గంటలకు కినలూర్‌లోని యూఎస్‌ఏ మైదానంలో నిర్వహించే పోటీలకు హాజరు కావాలని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జైపాల్‌రెడ్డి, అనిల్‌కుమార్ సూచించారు. 2012, 2013, 2014 సంవత్సరాల్లో జన్మించిన బాలికలు అర్హులని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 95390 07640 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అన్ని ఎన్నికల్లో సత్తా చాటాలి



బీజేపీ జిల్లా అధ్యక్షుడి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

- ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి టౌన్: పట్టభద్రుల, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలతోపాటు వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ సత్తాచాటాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నీలం చిన్నరాజులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ అధ్యక్షురాలు అరుణతార నుంచి నీలం చిన్నరాజులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించేలా ఇప్పటి నుండే కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా ఎదుర్కొనేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు మురళీధర్‌గౌడ్, బాణాల లక్ష్మారెడ్డి, కిషన్‌రావు, నేరెళ్ల ఆంజనేయులు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సన్నద్ధం

- ఇప్పటికే నోడల్ అధికారుల నియామకం
- 11 న పోలింగ్ కేంద్రాల ముసాయిదా ప్రకటన

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే నోడల్ అధికారులను నియమించారు. బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేశారు. మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పాటు పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. పంచాయతీ ఎన్నికలతో పాటు మండల, జిల్లా పరిషత్ ఎన్నికల కోసం ఈనెల 11 న పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాలు ప్రకటించనున్నారు. 11 నుంచి 13 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. 13 న రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించి 14 న అభ్యంతరాలపై నిర్ణయం తీసుకుంటారు. 15 న ఫైనల్ డ్రాఫ్ట్ ప్రకటిస్తారు.

ఎన్నికల అధికారులకు శిక్షణ

మండల, జిల్లా పరిషత్ ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఈనెల 12 లోపు శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు 15 లోపు శిక్షణ పూర్తి చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర ఎన్నికల అధికారుల నుంచి వస్తున్న ఆదేశాలను చూస్తుంటే ఎన్నికల షెడ్యూల్ ఈ నెలలోనే వచ్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

నెర్రలు బారుతున్న ఆశలు

- నీరందక ఎండుతున్న వరి పంట
- ఆవేదనలో అన్నదాతలు



మిర్జాపూర్ శివారులో ఎండుతున్న వరి పంట

నస్రుల్లాబాద్: నిజాంసాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీరున్నా.. ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందక అప్పుడే పంటలు ఎండుముఖం పడుతున్నాయి. నిజాంసాగర్ 25వ ఉప కాలువ కింద సాగు చేసిన వరి పంట ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నస్రుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్‌తో పాటు బీర్కూర్ పరిసర ప్రాంతాలలోని కొల్లూర్, వీరాపూర్ గ్రామాల పరిధిలో ఎక్కువగా వరి సాగు చేశారు. బోరుబావులతోపాటు నిజాంసాగర్ నీటి ఆధారంగా పంటలు సాగవుతున్నాయి. నిజాంసాగర్ నుంచి విడుదలవుతున్న నీరు 25వ నంబర్ ఉప కాలువ ద్వారా ఈ గ్రామాలకు చేరాల్సి ఉంది. కానీ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నీరు చివరి వరకు అందడం లేదు. ఎగువన ఉన్న ఆయకట్టు రైతులే ఎక్కువగా వినియోగించుకుంటున్నట్లు తెలుస్తోంది. దీంతో ఉప కాలువ చివరి ఆయకట్టుకు నీరందక భూములు నెర్రలు బారుతున్నాయి. గ్రామ శివారులో సుమారు 200 ఎకరాలలో వరి పంట ఎండుముఖం పట్టిందని మిర్జాపూర్ రైతులు పేర్కొంటున్నారు. వారబందీ ప్రకారం నిజాంసాగర్ ప్రాజెక్టునుంచి ప్రధాన కాలువకు నీరు విడుదలవుతోంది. మూడో విడతలో ఇప్పటికే వారం రోజులనుంచి నీటిని విడుదల చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో నీటి విడుదలను నిలిపివేయనున్నారు. అయితే నీటి విడుదలను మరో ఐదు రోజులు కొనసాగిస్తే తమ పంటలకు నీరందే అవకాశాలున్నాయని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి, చివరి ఆయకట్టు వరకు నీరందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నీరు నింపాలి



నిజాంసాగర్ ప్రాజెక్టు నీటిపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నాం. నీరందక మూడెకరాల పొలం ఎండిపోతోంది. చెరువులో నీరు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. నిజాంసాగర్ నీటితో చెరువు నింపి రైతులను ఆదుకోవాలి.

– శ్రీనివాస్, రైతు, మిర్జాపూర్

ఆరు ఎకరాలు ఎండిపోతోంది



15 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి వేశాను. నీరందక ఆరు ఎకరాలు ఇప్పటికే బీటలువారింది. నీరందక పంట ఎండిపోతోందని తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లాం. కాలువ వద్ద కాపలా ఉండి చివరి వరకు నీరందేలా చూసుకోవాలని సలహా ఇస్తున్నారు.

– జంగిలి చిన్న బాలేశ్, రైతు, మిర్జాపూర్

నీరందేలా చూడాలి



నాకున్న 5 ఎకరాలలో వరి నాట్లు వేశాను. నీరు అందక పంట ఎండిపోతోంది. ఇలాగైతే పెట్టుబడులు కూడా మీదపడతాయి. కాలువల చివరి వరకు నిజాంసాగర్ ప్రాజెక్టు నీరందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– శంకరప్ప, రైతు, మిర్జాపూర్

క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మద్నూర్: ఈ నెల 27న ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలను శుక్రవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. మండల కేంద్రంలోని ఉర్దూమీడియం పాఠశాలలో ఉన్న రెండు గదులను పరిశీలించారు. ఒక గదిలో ఉపాధ్యాయ, మరోగదిలో పట్టభద్రుల ఓటర్ల కోసం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ ఎండీ ముజీబ్, ఎంపీవో నర్సయ్య, గిర్దావర్ శంకర్ ఉన్నారు.

'జిల్లాకు మంచి పేరు తేవాలి'



కామారెడ్డి క్రైం: భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ సింధు శర్మ ఆకాంక్షించారు. కరీంనగర్‌లో గతనెల 28 నుంచి ఈనెల ఒకటో తేదీ వరకు జరిగిన తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా పోలీసు క్రీడాకారులను శుక్రవారం ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా క్రీడాకారులు 2 బంగారు, 5 రజత, 3 కాంస్య పథకాలు సాధించారన్నారు. రన్నింగ్, రెజ్లింగ్, టేబుల్ టెన్నిస్ తదితర క్రీడల్లో మన క్రీడాకారులు ప్రతిభ చూపారని పేర్కొన్నారు. అదే ఉత్సాహంతో విధుల్లో కూడా మంచి ప్రతిభ చూపాలన్నారు. భవిష్యత్‌లో క్రీడాపోటీల్లో మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ యాకూబ్ రెడ్డి, సీఐలు సంతోష్ కుమార్, నవీన్ కుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని ఫత్లాపూర్ జాతీయ రహదారిపై శుక్రవారం తుఫాన్ వాహనం టైరు పగిలి అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకుపోయింది. ఈ ఘటనలో వాహనంలోని డోంగ్లీ గ్రామానికి చెందిన ప్రయాణికులకు గాయాలు అయ్యాయి. ఈ సమయంలో అటునుంచి వెళ్తున్న జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతరావు ప్రమాదానికి గురైన వాహనాన్ని చూసి, అంబులెన్స్‌ను పిలిపించారు. క్షతగాత్రులను పరామర్శించి, చికిత్స నిమిత్తం బిచ్కుంద ఆస్పత్రికి తరలించారు.

విష ప్రయోగం.. కోళ్లు మృతి

వర్ని: మండల కేంద్రంలో సుమారు 30నాటు కోళ్లు విష ప్రయోగంతో మృతిచెందాయి. వివరాలు.. జాకోరా రోడ్డులోని స్పైసీ దాబాలో పాషా అనే వ్యక్తి 30 నాటు కోళ్లను పెంచుకుంటున్నాడు. అవి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో తరచూ వస్తున్నాయని ఆ స్థల యజమాని కిట్టయ్య కోళ్లకు విషం పెట్టి చంపివేసినట్లు బాధితుడు వర్ని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ చేపట్టారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండలం నాగేంద్రనగర్‌లోని ఓ ఇంటిలో శుక్రవారం వేకువజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. జంగం చిన్న ముత్తెన్న అనే వ్యక్తి తన ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లగా, దుండగులు తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో దాచుకున్న బంగారు, వెండి ఆభరణాలు, నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

చెరువులో యువకుడి గల్లంతు

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువులో ఓ యువకుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. జిల్లా కేంద్రంలోని ఆర్‌బీ నగర్ కాలనీకి చెందిన చిన్నచెవ్వ రాములు అతని చిన్నకొడుకు సాయికుమార్ (24)తో కలిసి శుక్రవారం సాయంత్రం పెద్ద చెరువుకు వెళ్లారు. స్నానం చేసేందుకు సాయికుమార్ చెరువులోకి దిగగా, లోతు ఎక్కువగా ఉండడంతో ఈత రాక గల్లంతయ్యాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో దేవునిపల్లి పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం ఉదయం గాలింపు చర్యలను తిరిగి ప్రారంభిస్తామని పోలీసులు తెలిపారు.

ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్
- జిల్లా వ్యాప్తంగా 14 పరీక్షా కేంద్రాల ఏర్పాటు చేసిన అధికారులు



అధికారులకు సూచనలిస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి క్రైం: రానున్న విద్యా సంవత్సరానికి జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వి.విక్టర్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఖాళీ సీట్ల భర్తీకి నేడు(శనివారం) ప్రవేశ పరీక్ష జరుగనుందని తెలిపారు. ఇంటర్‌కు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు, తొమ్మిదో తరగతికి ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 వరకు ప్రవేశ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. 14 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వాటిలో 13 కేంద్రాలు కామారెడ్డి, ఒక కేంద్రం నిజాంసాగర్‌లో ఏర్పాటు చేసినట్లు వివరించారు. 9వ తరగతి పరీక్షకు 1,739 మంది, ఇంటర్‌కు 2,103 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఆయా కేంద్రాలకు చీఫ్ సూపరింటెండెంట్ లను నియమించామన్నారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, కేంద్రాల వద్ద 144 సెక్షన్, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష సమయంలో సమీపంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలన్నారు. డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రావణ్ కుమార్, తహసీల్దార్ జనార్దన్, కామారెడ్డి మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

జీఎస్‌టీతో దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టం

- జీఎస్‌టీ వర్క్‌షాప్‌లో ప్రొఫెసర్ శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

కామారెడ్డి అర్బన్: పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించాలనే ఉద్దేశంతో వినూత్న పద్ధతిలో బోధన తరగతులు నిర్వహిస్తున్నట్లు ఇందులో భాగంగా వివిధ అంశాలపై వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ కె.విజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రంలో జీఎస్‌టీ నిబంధనల అమలు–ఆర్థిక వ్యవస్థపై ప్రభావం అనే అంశంపై వర్క్ షాపు నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌గా హాజరైన ప్రొఫెసర్ కస్తూరి శ్రీనివాస్ వివిధ అంశాలపై విద్యార్థులకు వివరించారు. దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసే చక్కని విధానం జీఎస్‌టీ అన్నారు. వైస్ ప్రిన్సిపల్ కె.కిష్టయ్య, కామర్స్ విభాగం అధిపతి అంకం జయప్రకాష్, కళాశాల అకడమిక్ సమన్వయకర్త విశ్వప్రసాద్, అధ్యాపకులు మాట్లాడారు.

ఈవీఎం గోదాం సందర్శన



కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శుక్రవారం సందర్శించారు. గోదాంలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన తీరును సీసీ ఫుటేజీ ద్వారా తనిఖీ చేశారు. పోలీసు బందోబస్తు వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్, తహసీల్దార్ జనార్దన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు సరళ, డీటీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్



కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్ కుమార్‌ను గెలిపించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో భాగస్వామ్య సంఘాల సమావేశం నిర్వహించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్య బలోపేతానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. ధన రాజకీయాలను ఓడించి ఉద్యమ నాయకులను ఎన్నుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకటి అన్నారు. నాయకులు లింగం, శ్రీనివాస్, ఆకుల బాబు, వెంకట్‌రెడ్డి, ప్రవీణ్ నాయక్ తదితరులున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్దార్ రవీందర్‌ను గెలిపించాలి



కామారెడ్డి టౌన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్దార్ రవీందర్ సింగ్‌ను గెలిపించాలని శాతవాహన యూనివర్సిటీ జేఏసీ వ్యవస్థాపక చైర్మన్ చెన్నమల్ల చైతన్య కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. రవీందర్ కరీంనగర్ మేయర్‌గా ఉన్నప్పుడు ఒక రూపాయికి అంత్యక్రియలు, ఇంటింటికి నల్లా ఏర్పాటు, సరస్వతి ప్రసాదం పంపిణీ వంటి కార్యక్రమాలు చేసి ప్రజాదరణ పొందారని వివరించారు. పట్టభద్రుల కోసం ఒక రూపాయికి జీవిత ప్రమాద బీమా పథకాన్ని రూ.5లక్షల వరకు వర్తింపజేసేలా ముందుకు వస్తున్నాడని చెప్పారు.

మార్చి 19న రాంలీలా మైదానంలో బీమా ఏజెంట్ల నిరసన



కామారెడ్డి అర్బన్: వృత్తి మనుగడకే ప్రమాదం ఏర్పడే మార్పులు వస్తున్నందున వాటిని వ్యతిరేకిస్తూ వచ్చే నెల 19న కొత్త ఢిల్లీలోని రాంలీలా మైదానంలో పెద్ద ఎత్తున ఎల్‌ఐసీ ఏజెంట్లు మహాధర్నా నిర్వహించనున్నట్టు భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) ప్లానింగ్ కమిటీ జాతీయ వైస్ చైర్మన్ ఎల్. కిశోర్ చంద్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన లియాఫీ కామారెడ్డి శాఖ అత్యవసర కార్యవర్గ సమావేశం కదం నారాయణరావు అధ్యక్షతన జరిగింది. ప్రతి ఎల్‌ఐసీ బ్రాంచ్ నుంచి కనీసం 50 మంది ఏజెంట్లు తరలిరావాలని కిశోర్‌చంద్ పిలుపునిచ్చారు. బ్రాంచ్ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ కుమార్ జైన్, క్లియా అధ్యక్షుడు వి.రాజారెడ్డి, కోశాధికారి ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యం



నిజాంసాగర్(జుక్కల్): సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. శుక్రవారం జుక్కల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంబేడ్కర్ సంఘం నేతలు, దళితులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సంతానోత్పత్తి శిబిరం

పిట్లం(జుక్కల్): చిన్నకొడప్‌గల్, ధర్మారం గ్రామాలలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్యం, సంతానోత్పత్తి శిబిరం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి సంతోష్ మాట్లాడారు. డాక్టర్లు మజీద్, మణికుమార్, సూపర్ వైజర్ బస్వరాజ్, గోపాలమిత్రలు అహ్మద్, గౌస్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాలను వెంటే ఉంచుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): వాహనదారులు తమ వద్ద తప్పకుండా ధ్రువపత్రాలను ఉంచుకోవాలని ఎస్సై మహేందర్ సూచించారు. శుక్రవారం మండలంలోని అంజని చౌరస్తా వద్ద వాహనాలను ఎస్సై తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది అంజి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఖలీల్‌వాడి: ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి శుక్రవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివరాలు ఇలా.. నవీపేట్ మండలంలోని పోతంగల్ గ్రామానికి చెందిన శంకర్ (58) కుటుంబంతో సహా ఎనిమిది నెలల క్రితం నగరానికి వలస వచ్చారు. ఎల్లమ్మ గుట్ట అమ్మ వెంచర్‌లో వాచ్‌మెన్‌గా ఉద్యోగం చేస్తూ, జీవనం సాగించేవాడు. ఇంటి నిర్మాణం, కూతురు పెళ్లికి అప్పులు చేయగా, బాకీలు తీర్చుకోలేనని మనోవేదన చెందేవాడు. ఈక్రమంలో రెండు రోజుల క్రితం అతడు పురుగుల మందు తాగి, ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య నర్సుబాయి ఫిర్యాదు మేరకుకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు.

కంజర్ గ్రామంలో మరొకరు..

మోపాల్: మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన మిద్దె విశాల్ (20) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. వివరాలు ఇలా.. గత నెలలో విశాల్, నిఖిలేష్, అరవింద్ మధ్య వ్యక్తిగత విషయాల్లో ఘర్షణ జరిగింది. దాడిలో నిఖిలేష్‌పై విశాల్ దాడి చేయగా, నిఖిలేష్ చేయి విరిగింది. కుటుంబ సభ్యులు విశాల్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయగా, రాజీ కోసం కుల పెద్దలు పంచాయితీ పెట్టారు. దీంతో మనస్తాపానికి గురైన విశాల్ గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని గమనించి ఆస్పత్రికి తరలించగా, చికిత్స అందించడంతో ఆరోగ్యం కొద్దిగా మెరుగుపడింది. మళ్లీ మూడ్రోజుల క్రితం అనారోగ్యానికి గురి కాగా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించి శుక్రవారం అతడు మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.



విశాల్ (ఫైల్)

సదాశివనగర్‌లో వృద్ధురాలి ఆత్మహత్య



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో ఓ వృద్ధురాలు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాలు ఇలా.. సదాశివనగర్‌కు చెందిన బాయికాడి సుశీల(70) గత కొన్ని రోజులుగా లింపోమా క్యాన్సర్‌తో బాధ పడుతుంది. ఆస్పత్రిలో చూపించిన వ్యాధి నయంకాకపోవడంతో జీవితంపై విరక్తి చెందింది. ఈక్రమంలో గ్రామ శివారులోని బావిలో పడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చెట్లను నరికిన వ్యక్తిపై కేసు నమోదు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని రాంపూర్‌గడ్డ తండా పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరికివేసిన పిట్లరాములుపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన చెట్లను నరికివేసినట్లు గ్రామస్తులు గుర్తించి, జీపీ కార్యాదర్శి దృష్టికి తీసుకువచ్చారు. కార్యదర్శి ప్రకృతివనంను పరిశీలించి అధికారులకు సమాచారం ఇచ్చారు. కార్యదర్శి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేశామని, అదే గ్రామానికి చెందిన పిట్ల రాములు అనే వ్యక్తి చెట్లను నరికివేసినట్లు తేలిందన్నారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

రూరల్ మండలంలో ముగ్గురి అదృశ్యం

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్‌పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ముగ్గురు మహిళలు అదృశ్యమయ్యారు. వేర్వేరు రోజులలో వారు అదృశ్యమవగా శుక్రవారం వెలుగులోకి వచ్చాయి. రూరల్ ఎస్సై–2 ఆనంద్‌సాగర్ తెలిపిన వివరాలు ఇలా.. కంఠేశ్వర్ ప్రాంతానికి చెందిన గుండ్ల రాధ(50) రెండు రోజుల కిందట విద్యుత్‌నగర్‌లో ఉన్న తన చెల్లెలు ఇంటికి వెళ్లివస్తానని చెప్పి, ఇంత వరకు తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం రాధ కూతురు నాగజ్యోతి రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

గుండారం గ్రామానికి చెందిన కుంచపు లక్ష్మీ(35) కుటుంబ కలహాల కారణంగా రెండు రోజుల క్రితం ఇంటినుంచి వెళ్లిపోయి, ఇంతవరకు తిరిగిరాలేదు. భర్త ఎల్లయ్య ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంద్రశేఖర్‌కాలనీకి చెందిన నూలపెల్లి భాగ్యలక్ష్మీ (20) శుక్రవారం ఉదయం మెడికల్ షాపుకు వెళ్లివస్తానని చెప్పి ఇంతవరకు ఇంటికి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఇందల్వాయి మండలంలో..



ఇందల్వాయి:మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన అగ్గు వంశీ(27) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వంశీ శుక్రవారం ఉదయం కుటుంబ కలహాల కారణంగా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయాడు. ఇప్పటికీ తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వంశీ ఎరుపు గీతలు, ముదురు నీలిరంగు షర్ట్, తెలుపు రంగు ఫ్యాంట్ ధరించాడని, ఎవరైనా ఆచూకీ తెలిసినచో ఇందల్వాయి ఎస్సై 87126 59854, డిచ్‌పల్లి సీఐ–87126 59851కు సమాచారం అందించాలని కోరారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

విద్యార్థులతో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



విద్యార్థులతో భోజనం చేస్తున్న కలెక్టర్ సంగ్వాన్

రామారెడ్డి: విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. శుక్రవారం ఆయన ఉప్పల్‌వాయిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. వార్షిక పరీక్షలకు ఏ విధంగా సన్నద్ధమవుతున్నారో తెలుసుకుని, సూచనలు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ వసతి గృహాన్ని పరిశీలించారు. వంట గదిలో పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడాన్ని గమనించి ప్రిన్సిపల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జాతీయస్థాయి పరుగు పందెంలో బంగారు పతకం సాధించిన ప్రవీణ్ అనే విద్యార్థిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సంజయ్ కుమార్, తహసీల్దార్ సువర్ణ, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, ఎంఈవో ఆనంద్‌రావు, ప్రిన్సిపల్ శివరాం తదితరులు పాల్గొన్నారు.

డెబ్బై ఏళ్లనాటి సమస్య పరిష్కారం..!



దారిని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): వదల్‌పర్తిలో పాతఊరిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి, గ్రామశివారులోని పోచారంప్రాజెక్టులో పశువులు దాహర్తిని తీర్చుకోవడానికి వెళ్లేందుకు దారిని ఏర్పాటు చేయడంతో సుమారు 70 ఏళ్లనాటి సమస్య పరిష్కారమైంది. ఈ దారిని కొంతకాలంగా కొందరు వ్యక్తులు కబ్జాచేసుకొని పంటలను సాగు చేసుకుంటున్నారు. దీంతో ఆలయానికి వెళ్లేందుకు భక్తులు, దాహర్తిని తీర్చుకునేందుకు పశువులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఎట్టకేలకు గ్రామస్తుల విన్నపం మేరకు ఆర్‌ఐ మహ్మద్, జూనియర్ అసిస్టెంట్ సాయిలు శుక్రవారం పోలీసులతో కలిసి గ్రామానికి చేరుకొని సర్వే చేసి కబ్జాలను తొలగించి దారిని ఏర్పాటు చేశారు.దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతారా?



బీఆర్ఎస్ కార్యాలయంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి, పాల్గొన్న మాజీ మేయర్ నీతూకిరణ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు

- అధికారులు, పోలీసుల పేర్లు రెడ్‌బుక్కులో నమోదు చేస్తా
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్: అధికార పార్టీ నేతలకు అధికారులు, పోలీసులు వత్తాసు పలుకుతారా.. మీరందరి పేర్లను రెడ్‌బుక్‌లో నమోదు చేసుకుంటున్నా అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వారి సంగతి చూస్తానని అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు, అధికారులు వేధిస్తున్నారని వారందరి సంగతి చూస్తామన్నారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి అల్జీమర్ వ్యాధి వచ్చిందన్నారు. ఆరు గ్యారంటీలకు సంబంధించి కాంగ్రెస్ ఒక్క హామీ కూడా అమలు చేయలేదని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీని ప్రజలు తరిమికొట్టాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చివరి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అన్నారు. మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ అవినీతి బంధం కొనసాగుతుందన్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి కుమ్మక్కై ఆర్మూర్‌ను దోచుకుంటున్నారన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను తుంగలో తొక్కిన కాంగ్రెస్‌ను ప్రజలు తరిమికొట్టాలన్నారు. ఆర్మూర్‌లో కుక్కలు చిన్నపిల్లలపై దాడులు చేస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

దోషాలు తొలగిస్తామంటూ అపరిచితుల ప్రచారం

- దేహశుద్ధి చేసిన కోమట్‌పల్లి గ్రామస్తులు



అపరిచిత వ్యక్తులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన పోలీసులు

లింగంపేట(ఎల్లారెడ్డి): ఇంటి దోషాలు, కుటుంబ సభ్యుల దోషాలు తొలగించి, శుభాలు కలిగేలా తాయిత్తులు కడుతామని ప్రచారం చేస్తున్న అపరిచితులకు గ్రామస్తులు దేహశుద్ది చేసి, పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలోని కోమట్‌పల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కోమట్‌పల్లి గ్రామానికి శుక్రవారం షిఫ్ట్ కారులో ఐదుగురు అపరిచితులు వచ్చారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఇంటి దోషాలు, కుటుంబ సభ్యుల దోషాలు తొలగించడానికి వాస్తు ప్రకారం తాయిత్తులు కట్టి దోష నివారణ చేస్తామంటూ ప్రచారం చేశారు. పలువురి ఇళ్లకు వెళ్లి వాస్తు బాగాలేదని నమ్మబలికి కొంత డబ్బులు తీసుకున్నారు. కొందరు వారిపై అనుమానం వచ్చి గ్రామ పెద్దలకు సమాచారం ఇచ్చారు. కొంత మంది యువకులు, గ్రామ పెద్దలు వారిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారిని విచారించగా కరీంనగర్ జిల్లా సిరిసిల్లా మున్సిపల్ పరిధిలోని పెద్దూర్ గ్రామానికి చెందిన చల్ల శంకర్, బొమ్మెర సంతోష్, మఠం ప్రవీణ్, మఠం అశోక్, బొమ్మెర అంజనేయులుగా గుర్తించారు. వీరంతా కలిసి ఉదయం కోమట్‌పల్లి గ్రామానికి వచ్చినట్లు ఒప్పుకున్నారు. డబ్బుల కోసం ఈ పనికి ఒడిగట్టినట్లు తెలిపారు. ఎస్‌హెచ్‌వో ప్రకాష్‌నాయక్ ఐదుగురిని తహసీల్దార్ నరేందర్‌గౌడ్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలో డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, మద్యం తాగి వాహనాలు నడుపుతూ 17మంది పట్టుబడినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. వారికి నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి, అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరురిచామన్నారు. వారిలో 11మందికి రూ.15,500 జరిమానా, ఆరుగురికి రెండు రోజల జైలు శిక్షను జడ్జి విధించినట్లు తెలిపారు.

ఆర్మూర్ మండలంలో..

పెర్కిట్(ఆర్మూర్): ఇటీవల మామిడిపల్లి చౌరస్తాలో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా ఆదిలాబాద్ జిల్లా మామడ మండలం న్యూ సంఘ్వీ గ్రామానికి చెందిన బోస్ రాజశేఖర్ మద్యం తాగి వాహనం నడుపుతు పట్టుబడ్డాడు. దీంతో రాజశేఖర్‌ను ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుచగా జడ్జి అతడికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

డయల్100ను దుర్వినియోగం చేసిన వ్యక్తుల బైండోవర్

మద్నూర్: మద్యం తాగి డయల్ 100కు కాల్ చేసి న్యూసెన్స్ చేసిన ఇద్దరిని శుక్రవారం తహసీల్దార్ ఎండీ ముజీబ్ ఎదుట అధికారులు బైండోవర్ చేశారు. గ్రామానికి చెందిన వడ్డేవార్ గజానంద్, అవార్‌వార్ గంగాధర్‌లు అతిగా మద్యంతాగి ఇటీవల డయల్ 100కు ఫోన్ చేసి, పోలీసుల సమయాన్ని దుర్వినియోగం చేశారన్నారు. దీంతో వారిపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రెండు ఇళ్లు దగ్ధం



ఖలీల్‌వాడి: నగరంలోని కోటగల్లీలోగల రెండు ఇళ్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధం అయినట్లు ఫైర్ ఆఫీసర్ నర్సింగ్‌రావు తెలిపారు. కాలనీలోని సుమలత, ప్రసాద్‌లకు సంబంధించిన ఇళ్లలో శుక్రవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. వెంటనే ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు బయట పరుగులు తీశారు. మంటలు వ్యాపించడంతో ఆయా ఇళ్లలోని రూ. 3లక్షల నగదు, 10 తులాల బంగారం, 15 తులాల వెండి, ఇంటి సామగ్రి కాలి బూడిదయింది. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా, ఫైర్ ఇంజిన్ వచ్చేవరకు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఘటన స్థలాన్ని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యానారాయణ పరిశీలించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

స్క్రాప్ దుకాణంలో అగ్ని ప్రమాదం



ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని అబ్దుల్లా అనే వ్యక్తికి చెందిన స్క్రాప్ దుకాణంలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగినట్లు స్థానికులు శుక్రవారం తెలిపారు. దుకాణంలోనుంచి పొగలు రావడంతో స్థానికులు గమనించి వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు సకాలంలో వచ్చి మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు స్క్రాప్ దుకాణాన్ని జనావాసాల నుంచి దూరంగా తరలించాలని కాలనీవాసులు కోరుతున్నారు.